నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, సోమవారం 26 మే 2025 | MEDAK

హైదరాబాద్‌లో నందిని సిధారెడ్డి దంపతులను సన్మానిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నిబద్ధత కలిగిన రచయిత నందిని

- తెలంగాణ సమాజంపై ఆయన రచనలు బలమైన ప్రభావాన్ని చూపాయి
- నిక్కచ్చి వ్యక్తిత్వం సిధారెడ్డి సొంతం
- నమ్మిన సిద్ధాంతాలు, విలువలకు కట్టుబడి ఉన్నారు..
- మంజీరా రచయితల సంఘం స్థాపించి ఎందరికో ప్రేరణగా నిలిచారు
- నందిని సిధారెడ్డి ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

మెహిదీపట్నం, మే 25: కవిత్వంతో, సామాజిక కృషితో తెలంగాణ సమాజం మీద బలమైన ప్రభావం వేసిన వ్యక్తి నందిని సిధారెడ్డి అని, తెలంగాణ గడ్డ మీద జరిగిన ప్రతి ఉద్యమంలోనూ ఆయన పాత్ర గణనీయంగా ఉందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్‌లోని కాంటినెంటల్ పార్క్ హోటల్‌లో సిధారెడ్డి ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్‌రావు మాట్లాడుతూ.. తనకు నందిని సిధారెడ్డితో రెండు దశాబ్దాలకు పైగా అనుబంధం ఉందన్నారు. సిధారెడ్డి నిరాడంబరంగా, నిక్కచ్చిగా ఉంటారన్నారు. ఒకరి నుంచి ప్రయోజ నం పొందడం కోసమో, ఒకరి నుంచి మెప్పు పొందడం కోసమో చాలామంది తమ అభిప్రాయాలను ఈజీగా మార్చుకుంటారని, కానీ.. సిధారెడ్డి మాత్రం నమ్మిన విలువలకు కట్టుబడి నిజాయితీగా, నిబద్ధతతో ఉంటూ దేనికోసం రాజీపడని మనస్తత్వం ఆయన సొంతమన్నారు. తెలంగాణ ఉద్యమం కోసం తన ప్రమోషన్ సైతం వదులుకున్నారని గుర్తుచేశారు. ప్రలోభాలకు ఆయన లొంగరని, ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం సిధారెడ్డికి కోటి రూపాయలు నగదు, 300 గజాల జాగ ఇవ్వజూపితే తిరస్కరించారన్నారు. తెలంగాణ తల్లి రూపం మార్చినందుకు నిరసన తెలియజేసి, ప్రభుత్వం ఇవ్వజూపిన అవార్డును తిరస్కరించడంతో సిధారెడ్డి వ్యక్తిత్వం ఆకాశమంత ఎత్తుకు ఎదిగిందని పేర్కొన్నారు. అందుకే ఆయన కవిత్వం, వ్యక్తిత్వం అంటే ఎంతో ఇష్టమన్నారు. సిధారెడ్డి తన కవిత్వంలో స్పృశించని అంశం లేదని, ముఖ్యంగా తెలంగాణ రైతుల కష్టాల గురించి, కన్నీళ్ల గురించి ఆయన రాసిన కవితలు అద్భుతమని హరీశ్‌రావు గుర్తుచేశారు. రైతులు, స్త్రీలు, దళితులు, సమాజంలో అణిచివేతకు గురవుతున్న వారి పక్షాన నిలబడి కవిత్వం రాశారని, రైతుల గురించి 'బోరు దు:ఖం' అనే ఒక అద్భుతమైన కవిత రాశారని హరీశ్‌రావు గుర్తుచేశారు. సిధారెడ్డికి 70 ఏండ్లు నిండిన సందర్భంగా ఆత్మీయులు అందరం కలిస్తే బాగుంటుందని దేశపతి శ్రీనివాస్, విరాహత్ అలీ చెప్పగానే వెంటనే తాను వస్తానని చెప్పినట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ ఆత్మీయ అభినందన సభలో పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉందని, సిధారెడ్డి నిండునూరేళ్లు సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. వారు మరెన్నో రచనలు చేసి, సమాజాన్ని చైతన్య పరచాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. సిధారెడ్డి కవిత్వంలో దు:ఖం ఉంటది, వ్యంగ్యం ఉంటది, కానీ.. ఏది రాసినా అది అద్భుతంగా ఉంటదని,సిధారెడ్డి కేవలం కవిత్వం రాయడంతోనే తన బాధ్యత తీరిందనుకోలేదని, మెదక్ జిల్లాలో మంజీరా రచయితల సంఘాన్ని స్థాపించి ఎంతో మంది కవులను తీర్చిదిద్దారని హరీశ్‌రావు కొనియాడారు. దేశపతి శ్రీనన్న, తైదల అంజయ్య, ఇంకా చాలా మంది కవులు సిధారెడ్డి చేత, మంజీరా రచయితల సంఘం చేత ప్రభావితమై, ఎదిగి వచ్చారని చెప్పారు. ఉద్యోగ సంఘాల నేతగా ఎదిగిన దేవీప్రసాద్, దుబ్బాక ఎమ్మెల్యేగా పనిచేసిన దివంగత రామలింగారెడ్డి, జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు విరాహత్ అలీ, సీనియర్ జర్నలిస్టు రంగాచారి, ఇలా ఎంతో మందికి సిధారెడ్డి ప్రేరణ అని చాలామందికి తెలుసని హరీశ్‌రావు పేర్కొన్నారు. కేసీఆర్, సిధారెడ్డి ఇద్దరు క్లాస్ మేట్స్ అని, ఒకరంటే మరొకరికి గొప్ప గౌరవం, అనుబంధం ఉన్నాయని, సిధారెడ్డి సామర్థ్యం తెలుసు గనుకనే కేసీఆర్ తెలంగాణ సాహిత్య అకాడమీ నెలకొల్పి, దానికి మొదటి అధ్యక్షుడిగా సిధారెడ్డినే నియమించారని గుర్తు చేశారు.సిధారెడ్డి నేతృత్వంలోనే ప్రపంచ తెలుగు మహాసభలు ఎంతో గొప్పగా, విజయవంతంగా జరిగి, ప్రభుత్వానికి, తెలంగాణకు ఎంతో పేరు తెచ్చినట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తే, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రపంచ సుందరీమణుల పోటీలు పెడుతున్నదని విమర్శించారు. అనంతరం సిధారెడ్డిని హరీశ్‌రావు సన్మానించారు.

కోహీర్ నుంచి పోతిరెడ్డిపల్లి వెళ్లే సీసీ రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

మున్సిపాలిటీలతో సరి!

సిబ్బంది నియామకమేది.. సమస్యల పరిష్కారమేది?

- ఇటీవల మున్సిపాలిటీగా మారిన గడ్డపోతారం
- విలీనమైన నాలుగు గ్రామాలు
- సిబ్బంది నియామకం జరగక పడకేసిన పాలన
- సమస్యలు పరిష్కారం కాక ప్రజల ఇబ్బందులు
- మున్సిపల్ సేవలకు ప్రజల చక్కర్లు

పటాన్‌చెరు, మే 25: రాష్ట్ర ప్రభుత్వం సంగారెడ్డి జిల్లాలో పలు గ్రామ పంచాయతీలను ఇటీవల మున్సిపాలిటీలుగా మార్చింది. కొత్త మున్సిపాలిటీల్లో అధికారులు, సిబ్బందిని నియామకం జరగక పోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా ప్రభు త్వం అప్‌గ్రేడ్ చేసింది. జిన్నారం మండలంలోని గడ్డపోతారం గ్రామాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది. గడ్డపోతారం మున్సిపాలిటీలో జిన్నారం మండలంలో ఉన్న ఖాజీపల్లి, వాయిలాల, లక్ష్మీపతిగూడం, మాదారం పం చాయతీలతో మున్సిపాలిటీని ఏర్పాటు చేసిం ది. గడ్డపోతారం మున్సిపాలిటీగా మారిన తర్వాత సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మున్సిపాలిటీకి కమిషనర్‌ను ప్రభుత్వం నియమించింది. అభివృద్ధి, సంక్షేమ పథకాల పర్యవేక్షణ కోసం మిగతా అధికారులు, సిబ్బందిని నియమించక పోవడంతో పాలన సరిగ్గా సాగడం లేదు. గడ్డపోతారం మున్సిపల్ కార్యాలయానికి డీఈ, ఏఈ, టీపీవో, మేనేజర్‌తో పాటు ఇతర సిబ్బందిని ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌తో పాటు ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు పని చేస్తున్నారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం డీఈ, ఏఈ పోస్టులు మంజూరు చేసినా, భర్తీ కాలేదు. ఇన్‌చార్జి డీఈ ఒకరు పనిచేస్తున్నారు. ఏఈ పోస్టు ఖాళీగా ఉంది. గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలో విలీనం కావడంతో ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు గడ్డపోతారం మున్సిపల్‌లో పనిచేస్తున్నారు. వీరు ఆస్తి పన్నులు వసూలు చేస్తున్నారు. పారిశుధ్య పనులు పర్యవేక్షణ కోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. పారిశుధ్య ప నులు పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నారు. ఈ మున్సిపల్ పరిధిలో 13వేల జనాభా ఉంది.

సమస్యల పరిష్కారంలో అధికారుల విఫలం?

గడ్డపోతారం మున్సిపల్ పరిధిలో ఖాజీపల్లి, వాయివాల, లక్ష్మీపతిగూడెం, మాదారం గ్రామాలున్నాయి. మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలు 3 నుంచి 5 కిల్లోమీటర్ల దూరంలో ఉంటాయి. తాగునీరు, పారిశుధ్యంతో ఈ గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆస్తి పన్ను వసూలు పర్యవేక్షణ చేసేందుకు రెవెన్యూ అధికారి, మేనేజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బిల్ కలెక్టర్లు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు ఆస్తి పన్నులు వసూలు చేస్తున్నారు. ప్రజలు జన్మదిన ధ్రువీకరణ, ఆస్తి పన్నులు చెల్లింపు, ఇంటి అనుమతులు, కొత్త ఇంటి నంబర్ కోసం కార్యాలయం చుట్టూ ప్రజలు తిరిగే పరిస్థితి ఉంది.

సమస్యలు పరిష్కరిస్తాం..

గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కలిపించేందుకు కృషిచేస్తున్నాం. ప్రభుత్వం మున్సిపాలిటీగా ఏర్పాటు చేసిన తర్వాత పూర్తిస్థాయిలో అధికారులు, సిబ్బందిని నియమించలేదు. ఉన్న సిబ్బందితోనే పాలన సాగిస్తు న్నాం. ఆస్తి పన్నులు 96శాతం వసూలు చేశాం. తాగునీటి సమస్య లేకుండా పర్యవేక్షిస్తున్నాం. మున్సిపల్ పరిధిలో పరిశ్రమలు ఉన్నా యి. వాటి నుంచి ఆస్తి పన్నులు వసూలు చేస్తున్నాం. ప్రజలు సమస్యలుంటే నేరుగా కార్యాలయానికి రావాలి.
– జైతురాం నాయక్, మున్సిపల్ కమిషనర్ గడ్డపోతారం

సీసీ రోడ్లపై మురుగు ప్రవాహంతో ఇబ్బందులు
ఎక్కడపడితే అక్కడ పేరుకున్న చెత్త
కోహీర్‌లో సీసీ రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

కోహీర్ బల్దియా.. సమస్యలకు చిరునామా

కోహీర్, మే 25: తమ గ్రామ పంచాయతీ మున్సిపాలిటీగా అవతరించిందని ఆనాడు ఆ గ్రామస్తులు సంతోషపడ్డారు. ఇక మీదట తమకు ఎలాంటి సమస్యలు ఉండవని ఆశించారు. కానీ, వారి ఆశలు నిరాశలవుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో కోహీర్ గ్రామ పంచాయతీలో 21వేలకు పైగా జనా భా ఉంది. జనవరి 27న రాష్ట్ర ప్రభుత్వం కోహీర్‌ను మున్సిపాలిటీగా ప్రకటించింది. దీంతో తమ సమస్యలు తీరుతాయని గంపెడాశలు పెట్టుకొన్న ప్రజలకు ఆడియాశలయ్యాయి. కోహీర్‌లోని పలు వార్డుల్లో మురుగు కాల్వల నిర్మాణం ఇంత వరకు చేపట్టలేదు. తీంతో మురుగు నీరంతా సీసీ రోడ్లపై ప్రవహిస్తున్నది. గతంలో నిర్మించిన కొద్దిపాటి కాల్వలు కూడా చెత్తతో నిండిపోయాయి. ఆయా కాలనీల ప్రజలు కూడా చెత్తను ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారు. రోడ్డు పక్కన కూడా చెత్త నిల్వలు పేరుకుపోతున్నాయి. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రజాప్రతినిధులు అందుబాటులో లేకపోవడంతో ప్రజా సమస్యలను పట్టించుకునేవారు కరువయ్యారు. ప్రత్యేకాధికారుల పాలనలో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.

నిధులు లేక అధికారుల తిప్పలు...

కోహీర్ కొత్త మున్సిపాలిటీగా ఏర్పడడంతో మున్సిపల్ కమిషనర్లు బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మున్సిపల్ అధికారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు ఎన్ని సార్లు వేడుకున్నా అధికారులు ఏమిచేయలేక పోతున్నారు. కొత్త మున్సిపాలిటీ కోహీర్‌కు నాలుగు నెలల్లో ముగ్గురు కమిషనర్లు వచ్చారు. ముందుగా ఉమామహేశ్వర్ రావు, తర్వాత వెంకట్‌రెడ్డి విధులు నిర్వహించారు. నిధులు రాకపోవడంతో వారు చేసేదేమీలేక కోహీర్ నుంచి వెనుదిరిగారు. ప్రస్తుతం మున్సిపల్ కమిషనర్‌గా రమేశ్‌కుమార్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.నిధుల లేమితో పట్టణంలో ఎక్కడ చూసినా సమస్యలు దర్శనమిస్తున్నాయి. సీసీ రోడ్లపై మురుగు నీరు, రోడ్ల పక్కన చెత్త గురించి మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్‌ను వివరణ కోరగా.. సమస్యల పరిష్కరానికి కృషిచేస్తామని ఆయన తెలిపారు.

సీసీ రోడ్లపై నడవలేని పరిస్థితి

కోహీర్‌లోని హనుమాన్ దేవాలయం నుంచి నాగిరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే సీసీ రోడ్డుపై ఎప్పటికీ మురుగు పారుతున్నది. రోడ్డుపై నుంచి నడవలేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి కొత్త మురుగు కాల్వలు నిర్మించాలి.
–గణేశ్‌రెడ్డి, కోహీర్ వాసి

స్విమ్మింగ్ పోటీల్లో జిల్లాకు కాంస్య పతకాలు

సిద్దిపేట, మే 25: తెలంగాణ 10వ మహిళా, పురుషుల రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్–2025 పోటీల్లో సిద్దిపేట జిల్లా క్రీడాకారులు కాంస్య పతకాలు సాధించి సత్తాచాటారు. ఆదివారం సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో సిద్దిపేట జిల్లా క్రీడాకారిణి శ్రీహర్షప్రియ 50మీటర్ల బటర్‌ఫ్లై మహిళా విభాగంలో తృతీయ స్థానంలో, కె.హారతి బ్యాక్ స్టోక్ 50 మీటర్ల మహిళా విభాగంలో తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాలు సాధించారు. వీరిని సిద్దిపేట జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున్, డీవైఎస్‌వో వెంకట్‌నర్సయ్య, వాలీబాల్ సెక్రటరీ రవీందర్‌రెడ్డి అభినందించారు.

టిప్పర్ ఢీకొనగా ఘటనా స్థలిలో గుమిగూడిన జనం (ఫైల్)

దూసుకొస్తున్న టిప్పర్

ఓవర్ లోడ్ రవాణాతో రోడ్డు ప్రమాదాలు

- రెట్టింపు కంకరను తరలిస్తున్న వాహనదారులు
- మైనింగ్ ఆదాయానికి భారీగా గండి
- కళ్లు మూసుకున్న రవాణా శాఖ అధికారులు..?
- క్రషర్ల లూటీపై నోరు విప్పని మైనింగ్‌శాఖ అధికారులు..?
- టిప్పర్లకు ఇంత అని టార్గెట్లు?
- లక్డారం నుంచి నిత్యం వందల వాహనాల ప్రయాణం
- తూతూమంత్రంగా జరిమానాలు
- ధ్వంసమవుతున్న ఆర్‌అండ్‌బీ రోడ్లు
- సగం రోడ్డు ప్రమాదాలకు టిప్పర్లే కారణం
- రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుల సదస్సులు

పటాన్‌చెరు రూరల్, మే 25: అధిక లోడుతో వెళ్తున్న టిప్పర్లపై చర్యలకు సంబంధిత అధికారులు వెనుకాడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రెట్టింపు కంకరను బిల్డర్ల వద్దకు తరలించి వాహన యజమానులు సొమ్ముచేసుకుంటున్నారు. అధిక లోడుతో వాహనాలు తిరుగుతున్నాయని రవాణాశాఖ సిబ్బంది తెలిసినా చర్యలు తీసుకోవడం లేదని, వాటికి టిప్పర్ల వారీగా టార్గెట్‌లు ఖాయం చేసినట్టుగా ఆరోపణలు ఉన్నాయి. అధిక లోడుతో వెళ్తున్న టిప్పర్లతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. లక్డారం నుంచి నిత్యం అధిక లోడుతో వెళ్తున్న వందలాది వాహనాలతో మైనింగ్‌శాఖకు ఆదాయం నష్టం జరుగుతున్నది. వేబిల్లు ప్రకారం, అనుమతించిన బరువుతో కంకర, డస్ట్ సరఫరా చేస్తే ప్రభుత్వానికి మంచి ఆదాయం సమకూరుతుంది. ఈ ఆదాయాన్ని ఎగ్గొట్టేందుకు అటు క్రషర్ల యజమానులు, టిప్పర్ల యజమానులు అధికలోడుతో వాహనాలను నింపి సరఫరా చేస్తున్నారు. వాటిని పట్టుకొని ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన రవాణాశాఖ అధికారులు పెద్దగా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. మరోపక్క పటాన్‌చెరు నియోజకవర్గంలో జరుగుతున్న సగానికి పైగా రోడ్డు ప్రమాదాలు కంకర, ఇసుక, డస్ట్, మట్టికొట్టే టిప్పర్లే కారణం. అటు మైనింగ్‌శాఖ, ఇటు రవాణాశాఖ అధికారుల నిఘా కరువైంది. టిప్పర్లతో వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను చూసి వాటిని నివారించేందుకు పోలీసులు అధికారులు ప్రత్యేకంగా క్రషర్ల డైవర్లకు అవగాహన సదస్సులు నిర్వహించారు.

లక్డారం నుంచి అధిక లోడుతో ప్రయాణిస్తున్న టిప్పర్లు

పదుల సంఖ్యలో క్రషర్లు...

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలో లక్డారంలో ముప్పై వరకు క్రషర్లు ఉన్నాయి. వీటిలో వందల టిపర్లు కంకర, రాళ్లు, డస్ట్‌ను అర్ధర్లున్న ప్రాంతాలకు తరలిస్తాయి. ఒక్కో టిప్పర్ సామర్థ్యానికి మించి రెట్టింపు కంకర, డస్ట్, రాళ్లను సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటి కెపాసిటీ 30 టన్నులు ఉండగా, టిప్పర్లలో 50 నుంచి 60 టన్నుల వరకు తరలిస్తుండడంతో టిప్పర్ యజమానులకు రెట్టింపు ఆదాయం సమకూరుతున్నది. డీజిల్ ఖర్చు, లేబర్ ఖర్చు కలిసి వస్తున్నది. ఇదే సందర్భంలో ఈ అధిక లోడు వాహనాల ద్వారా ప్రభుత్వ మైనింగ్ శాఖకు కట్టాల్సిన పన్నులు సగం మాత్రమే కడతారు. అధిక బరువులో తీసుకెళ్లిన మెటీరియల్‌కు ఎలాంటి పన్ను చెల్లింపు ఉండదు. ఇలా నిత్యం వందలాది ట్రిప్పుల కంకర, రాళ్లు, డస్ట్ తరలించి వ్యాపారులు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. అటు మైనింగ్‌శాఖ నుంచి నియంత్రణ లేకపోవడంతో క్రషర్ల యజమానులు, టిప్పర్ల యజమానులకు ఆడింది ఆటగా, పాడింది పాటగా మారింది. ఒక్కో క్రషర్‌లో ఎంత మెటీరియల్ పోతుంది. ఎంత పన్ను కడుతున్నారు అనే నిఘా కరువైంది. మైనింగ్‌శాఖ అధికారులు తూతూమంత్రపు తనిఖీలతో క్రషర్ల యజమానులకు, టిప్పర్ల యజమానులకు సహకరిస్తున్నారనే ప్రచారం ఉంది. రాజకీయ నేతల కక్షసాధింపు కోసం కొన్ని క్రషర్లపై మాత్రం గట్టి చర్యలే తీసుకున్నారని సమాచారం.

అధికలోడు వాహనాలపై అధికారుల టోల్...

అధికలోడు వాహనాలను నడుపుతున్న క్రషర్ల యజమానులకు, టిప్పర్ల యజమానులకు రవాణాశాఖ సిబ్బంది నెలకింత చొప్పున వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మీరు లబ్ధి పొందుతున్నారు, మమ్మల్ని కూడా చూసుకోవాలి కదా..? అంటూ నిర్మొహమాటంగా ముక్కు పిండి సిబ్బంది వసూలు చేస్తున్నారని సమాచారం. ఇప్పటికే వాహనానికి ఇంత ఇవ్వాలనే సిబ్బంది డిమాండ్‌పై టిప్పర్ల యజమానుల మధ్య తీవ్రమైన చర్చలు జరిగి విషయం బయటకు పొక్కింది. ఈ డిమాండ్‌పై పలువురు క్రషర్ల యజమానులు కల్పించుకొని ధర ఖాయం చేసినట్టు ప్రచారంలో ఉంది.

జరిమానాలు విధించాం..

పటాన్‌చెరులో అధికలోడు వాహనాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. తనిఖీల ద్వారా ఇప్పటికే వందకు పైగా కేసులు నమోదు చేసి ఫైనాల్టీలు విధించాం. నిబంధనల మేరకు బరువుతోనే టిప్పర్లు ప్రయాణించాలి. నిరంతరం వాహనాలను తనిఖీలు నిర్వహిస్తున్నాం. టిప్పర్ల యజమానులను కూడా హెచ్చరించాం. రోడ్డు ప్రమాదాల నివారణకు టిప్పర్ల డైవర్లకు అవగాహన కల్పించాం. అధికలోడు వాహనాలను నియంత్రిస్తాం.
– విజయరావు, ఎంవీఐ పటాన్‌చెరు

అదే సమయంలో అధిక బరువుతో ప్రయాణిస్తున్న వాహనాలతో బ్యాతోల్, లక్డారం, ఎన్‌హెచ్–65 వరకు వేసిన రోడ్లపై తరుచూ గుంతలు తేలుతున్నాయి. ఆర్‌అండ్‌బీ మెయింటైన్ చేస్తున్నా ఈ రోడ్డు తక్కువ కెపాసిటీ కలిగినది. అధిక లోడు వాహనాల రాకపోకలతో ఈ రోడ్డు ఏటా దెబ్బతింటున్నది. టెండర్లు పిలిచి ఈ రోడ్డుకు తరుచూ మరమ్మతులు చేస్తున్నారు. రాజకీయ నాయకుల క్రషర్లు లక్డారంలో ఉండటంతో ఈ రోడ్డు టెండర్ల ప్రక్రియ యుద్ధ ప్రాతిపాదికన నిర్వహిస్తారు. ఈ టిప్పర్లు అధికారుల కంటపడకుండా గమ్యస్థానం చేరుకోవాలని డైవర్లపై ఒత్తిడి ఉంటుంది. డైవర్లు విపరీతమైన వేగంతో వెళ్తూ తరుచూ వాహనదారులను ఢీకొడుతున్నారు. పటాన్‌చెరు మండలంలో సగం రోడ్డు ప్రమాదాలకు కారణం టిప్పర్లే కావడం గమనార్హం. కొద్దిరోజుల క్రితం అప్పటి పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఎంవీఐ ఆర్. విజయరావు రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు టిప్పర్ల డైవర్లు, యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అధిక లోడు వాహనాల నియంత్రణపై, వాహన వేగ నియంత్రణపై అవగాహన కల్పించారు.

ప్రధాని నోట అన్నాసాగర్ మాట

మన్‌కీబాత్‌లో మహిళా రైతులను ప్రశంసించిన మోదీ
డ్రోన్ సహాయంతో వ్యవసాయంపై ప్రశంస

అందోల్, మే 25: దేశ ప్రధాని నరేంద్రమోదీ నోట అన్నాసాగర్ మాట రావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. డ్రోన్ సహాయంతో ఈ గ్రామ మహిళలు పంటలకు మందులు పిచికారీ చేస్తున్నారని ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్‌లో నరేంద్రమోదీ ప్రసంగించడంతో దేశవ్యాప్తంగా సంగారెడ్డి జిల్లా అన్నాసాగర్ పేరు మార్మోగింది. కేంద్ర ప్రభుత్వం నమో దీదీ పథకం కింద 80శాతం సబ్సిడీపై డ్రోన్లను అందిస్తున్నది. అందుకోసం ఇప్పటికే సంగారెడ్డి జిల్లాలోని 54మంది ఎస్‌హెచ్‌జీ మహిళలకు అందోల్‌లో శిక్షణ ఇచ్చి ఎంపిక చేశారు. డ్రోన్లతో పాటు అవసరమైన మెటీరియలతో కలిపి ఒక యూనిట్ ధర రూ. 10లక్షలు ఉండగా, లబ్ధిదారులు రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. డ్రోన్లు అందించి వాటి వాడకం, ఇతరత్రా వాటిపై 9రోజుల శిక్షణను మహిళలు పూర్తి చేసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు త్వరలో డ్రోన్లు అందజేయనుండగా, ఇదే విషయాన్ని ప్రధాని మోదీ ప్రసంగించడంతో మహిళా సంఘాల సభ్యులతో పాటు స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

లింగుపల్లిలో పిల్లర్ల స్థాయిలో నిలిచిపోయిన గ్రామ పంచాయతీ భవనం

రెండేండ్లయినా జీపీ భవనం పూర్తికాలే

లింగుపల్లిలో పిల్లర్లకే పరిమితమైన జీపీ భవనం

మిరుదొడ్డి, మే 25: సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలంలోని చెప్యాల గ్రామ పంచాయతీ మధిర గ్రామంగా కొన్నేండ్లుగా కొనసాగిన లింగుపల్లిని బీఆర్ఎస్ ప్రభుత్వం జీపీగా ఏర్పాటు చేసింది. గ్రామానికి గ్రామ పంచాయతీ భవనం లేకపోవడంతో కమ్యూనిటీ హాల్‌లో జీపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి పాలనను కొనసాగిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ గ్రామంలో జీపీ భవన నిర్మాణానికి మొదటి విడతలో రూ.10లక్షలు మంజూరు చే సింది. ఆ నిధులతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. భవన నిర్మాణ పనులు ప్రారంభించి రెండేండ్లు పూర్తవుతున్నా పిల్లర్ల స్థాయిలోనే నిలిచి పోవడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పనులు పూర్తిచేసి భవనాన్ని అందుబాటులోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కమ్యూనిటీ హాల్‌లో జీపీ కొనసాగిస్తుండడంతో కులాలకు సంబంధించిన వివిధ రకాల సమావేశాలు నిర్వహించుకోవడం ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు తెలిపారు.